## శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శాంతిభద్రతల పరిరక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని మదనపల్లె నూతన డిఎస్‌పి ఎస్.మహేంద్ర తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు బదిలీపై సిబిసిఐడి వెళ్లడంతో పోలీస్ గ్రౌండ్స్‌లో ఉన్న ధర్మవరంకు చెందిన మహేంద్రకు మదనపల్లె డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. శనివారం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన మహేంద్ర విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడ్డానికి సబ్ డివిజన్ పరిధిలోని అందరి పోలీస్ అధికారులతో సమావేశమై ప్రణాళిక రూపొందిస్తామన్నారు. చోరీలను అరికట్టేందుకు గస్తీలను ముమ్మరం చేస్తామని, ఘర్షణలు, గొడవలు జరగకుండా ముందుకు వెళ్తామన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పాటిస్తూ వారి సమస్యల పరిష్కారంపై పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం తనకు కొత్త అని త్వరలోనే పరిస్థితులను అవగాహన చేసుకుని ఈ వాతావరణానికి అనుకూలంగా తమ విధులను రూపొందించుకుంటానని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

# పేదరికం లేని సమాజమే ధ్యేయం

**- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి**

ప్రజాశక్తి- రాయచోటి

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రవాణా క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రైల్వేకోడూరు, మదనపల్లె ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, షాజహాన్‌బాష, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, జెసి ఆదర్శ్‌రాజేంద్రన్, డిఎఫ్‌ఒ జగన్నాథ్‌సింగ్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు, ఆర్‌డిఒలు, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పిజిఆర్‌ఎస్, రీ సర్వే 1, 2 దశలు, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఆర్డబ్ల్యుఎస్, గనులు భూగర్భం, గృహ నిర్మాణం, డ్వామా, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, వైద్య ఆరోగ్యం, ఐసిడిఎస్, పర్యాటకం, పాఠశాల విద్య నైపుణ్యాభివృద్ధి, అటవీ, పరిశ్రమలు, టిడ్కో, చేనేత జౌళి, ఎపిఎస్‌పిడిసిఎల్, జాతీయ రహదారులు, జల వనరులు, డిఆర్‌డిఎ, పౌరసరఫరాలు-దీపం2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ ప్రణాళిక, సహకారం, ఎక్సైజ్, రవాణా, సంక్షేమం, కార్పొరేషన్స్ తదితర శాఖల అంశాలపై చర్చించారు. సమావేశం ప్రారంభంలో కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా మంత్రి తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు తీసుకున్న చర్యల కార్యాచరణ నివేదికను సభ్యులకు అందజేశామన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లా సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా సమగ్ర అభివృద్ధి సాధనకు సమన్వయంగా కృషి చేద్దామన్నారు. జిల్లాకు తనను ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించి తనపై పెద్ద బాధ్యత అప్పగించారని చెప్పారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలలో నాలుగు స్థానాలలో ఎన్డీఏ కూటమి విజయం సాధించేందుకు సహకరించిన జిల్లా ప్రజలందరికీ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పింఛన్ల పంపిణీ, పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారం, జాబ్ మేళాల నిర్వహణ, రీ సర్వే, ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు, పల్లె పండుగ పనులు, సూక్ష్మ సేద్యపు పరికరాల, తదితర ఎన్నో అంశాలలో అన్నమయ్య జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు గాను నాలుగు నియోజకవర్గాలను ఎన్‌డిఏ కూటమికి అందించిన కార్యకర్తల సంక్షేమం ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలో ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ కొద్దినెలలకాలంలోనే ఎవ్వరికి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. గ్రామసీమల్లో వెలుగులు నింపడానికి పల్లె పండుగ కార్యక్రమంలో రోడ్లు డ్రైనేజీలు తాగునీటి సౌకర్య కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో సుమారు 65 లక్షల పెన్షన్లు ఇస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలో వేసవిలో నివారణకు కృషి చేస్తున్నారు. ఆరు మండలాల్లో నీటి సౌకర్యం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ జిల్లాలో టమోటా, మామిడి ఎక్కువ ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. హార్టికల్చర్ హబ్‌గా చేయడానికి సహకారం అవసరమని చెప్పారు. ప్రభుత్వ సేత్వంలో విద్య, ఐటి రంగాల అభివృద్ధి చెందడంతో పాటు రాయల సీమను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి మంత్రిని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి

# ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

**మొదటి సంవత్సరంలో 23, ద్వితీయ 14వ స్థానం**

**ప్రభుత్వ కళాశాలల్లో మెరిసిన ఆణిముత్యాలు**

ప్రజాశక్తి-రాయచోటి

ఇంటర్ ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. అన్నమయ్య జిల్లా 2025 అకడమిక్ ఇయర్‌లో 60 శాతంలో మొదటి సంవంత్సరం 23, 80 శాతంలో ద్వితీయ సంవత్సరం 14 స్థానాల్లో నిలిచింది. గత ఏడాడితో పోల్చితే ఒక స్థానం తగ్గింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 13,108 మంది విద్యార్థులు హాజరు కాగా 7814 మంది విద్యార్థులు పాసై 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 11,486 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందులో 9,175 మంది విద్యార్థులు పాస్ కాగా 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం 991 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 771 మంది పాస్ కాగా 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 895 మంది పరీక్ష రాయగా 702 మంది పాస్ కాగా 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫలితాలలో అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో మొదటి సంవత్సరంలో 23వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 14వ స్థానంలో నిలించింది. ఎపి రేసి జూనియర్ కాలేజ్ మొదటి సంవత్సరం 222 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 210 మంది విద్యార్థులు పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 216 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 215 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 55 మంది పరీక్ష రాయగా 53 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 102 మంది పరీక్ష రాయగా 97 మంది పాసయ్యారు. ఎపిఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 513 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 411 మంది పాసయ్యారు.ద్వితీయ సంవత్సరంలో 434 మంది పరీక్ష రాయిగా 383 మంది పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 2268 మంది పరీక్ష రాయగా 1247 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 2037 మంది విద్యార్థులు హాజరు కాక 1549 మంది పాసయ్యారు. హైస్కూల్ ప్లస్ మొదట సంవత్సరంలో 333 మంది విద్యార్థులు పరీక్షకు రాయగా 80 మంది మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 66 మంది పరీక్షలు రాధిక 43 మంది మాత్రమే పాస్ అయ్యారు. కెజిబివి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 401 మంది పరీక్ష రాయిగా 290 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 289 మంది పరీక్ష రాయగా 245 మంది పాసయ్యారు. మోడల్ స్కూల్ మొదటి సంవత్సరంలో 1520 మంది పరీక్ష రాయిగా1036 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 1074 మంది పరీక్ష రాయగా 905 మంది పాసయ్యారు. ప్రయివేట్ యునైడెడ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 7648 మంది పరీక్ష రాయిగా 4355 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 7134 మంది పరీక్ష రాయిగా 5607 మంది పాసయ్యారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో 991 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 702 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 895 మంది పరీక్ష రాయగా 702 మంది పాసయ్యారు. అయితే హై స్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలో మాత్రం ఉత్తీర్ణత శాతం చాలా దారుణంగా పడిపోయింది. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి నాగ జోష్ణ 470కి 463, వైష్ణవి 500కు 472, మోనిష్ 470కి 462, బి.కొత్తకోట కళాశాల నుండి హర్షవర్ధన్ 440కి 424, సాయి కీర్తన 1000కి 957, గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి నబీద 1000కి 970, మదనపల్లె ప్రభుత్వ బాలికల కళాశాల నుండి ఎబి ఇక్రామ 1000కి 959, ఫిర్ దోస్‌కు 1000కి 982, చొప్పున మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల ప్రతిష్టను మరింత పెంచారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన ఆధ్యాపకులను ఇంటర్మీడియట్ విద్యా జిల్లా అధికారి కృష్ణయ్య అభినందించారు.

పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

## వైభవం.. శ్రీపట్టాభిరాముడి పుష్పయాగం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం శ్రీపట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం పుష్పయాగంతో ముగిసాయి. స్వామివారికి పుష్పయాగం, మహానైవేద్యం, పుష్పప్రసాద వితరణ కార్యక్రమాలు టిటిడి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కన్నులపండువగా సాగింది. వేకువజామున స్వామివారికి సుప్రభాతం, శుద్ధి, పంచాంగ శ్రవణం, తోమాలసేవ, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. పుష్పయాగానికి తెచ్చిన వివిధ రకాల పుష్పాలను తిరుమాఢవీధుల్లో ఊరేగించి, పట్టాభిరామాలయంలో స్వామివారికి పుష్పయాగం, మహానైవేద్యం, పుష్పప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముగిసిన సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-కడప అర్బన్

రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని కడప విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. శుక్రవారం రాత్రి ఒంటిమిట్ట శ్రీసీతాసమేత కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11 గంటలకు కడప విమానాశ్రయం నుండి విజయవాడకు తిరుగు పయనమైన ఆయనకు జిల్లా నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. కడప విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు పలికిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, టిటిడి ఇఒ శ్యాములరావు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ ఉన్నారు. వారితో పాటు అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, కడప, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్ ఆర్.శ్రీనివాసులరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, లక్ష్మీరెడ్డి ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## 'ఆపరేషన్ కగార్' కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలో ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని రెవెన్యూ కాంప్లెక్స్ వద్దనున్న అంబేద్కర్ స్థలంలో 'ఆపరేషన్ కగార్' పేరుతో దండకారణ్యంలో ఆదివాసీల పై ప్రభుత్వ సాయుధ బలగాల హత్యాకాండను నిరసిస్తూ కరపత్రం ఆవిష్కరించారు. ఈ నెల20న కడపలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, యువతకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి గోపాల్, పౌర హక్కుల సంఘం సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పి. రెడ్డయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, బంజారా సంఘం నాయకులు శంకర్ నాయక్, బీసీ సంఘం నాయకులు రాఘవయ్య, కార్మిక నాయకులు మెహబూబ్ భాష, భారత్ అంబేద్కర్ మిషన్ నాయకులు పల్లం తాతయ్య, పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి ఎం. రవి శంకర్, కార్యవర్గ సభ్యుడు వంగిమల్ల రమణ,న్యాయవాదులు రమణ, దళిత నాయకులు నాగార్జున పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

# వైభవంగా కోదండరాముడి రథోత్సవం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. శ్రీసీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**రేపు చక్రస్నానం :** శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**15న పుష్పయాగం :** శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు మంగళవారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

# మంత్రి కనుసన్నల్లో ఇసుక మాఫియా : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలో రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కనుసన్నల్లో జిల్లాలో ఇసుక మాఫియా చెలరేగిపోయి ఇసుక కొల్లగొడుతున్నదని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమలులో ఉన్నా, జిల్లాలో ఉన్న ప్రజలకి ఇసుక అందుబాటులోకి లేకుండా పోయిందన్నారు. ఇసుక మాఫియా మాత్రం మంత్రి అండదండలతో పెద్ద ఎత్తున ఇసుకను తరలించకపోతున్నారని పేర్కొన్నారు. సుండుపల్లి మండల సమీపంలో ఎర్రమనేనిపాలెం వద్ద బహుదా నెల్లూరు ప్రసాద్‌రెడ్డి, రాంబాబు తదితరులు ప్రతిరోజు టిప్పర్లతో లక్షల విలువ చేసే ఇసుకను తోడి, తరలిస్తున్నారని అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. సుండుపల్లి నుండి పీలేరు వెళ్లే రోడ్డు నుండి భాగంపల్లి నుండి టిప్పర్లు వెళ్ళడానికి ఏకంగా హిటచిలతో దాదాపు ఆరు కిలోమీటర్లు రోడ్డు వేశారంటే ఇసుకాసురులు ఎంత బరితేగించారో అర్థం అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరు ప్రసాద్‌రెడ్డి, రాంబాబు మొదలగు వారు ఇసుక మైనింగ్‌లో ఆరితేరిపోయారని బహుదా, మహల్, కలకడ, మేడికుర్తి మొదలగు ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తోడేసి అమ్ముకున్నారని, చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం, చదల్ల వద్ద హిటాచీలతో ఇసుకను అక్రమంగా తరలించేసుకున్నారని వివరించారు. ఇసుకాసురులు బహాటంగానే మంత్రి అండదండలు ఉన్నాయని, అధికారులు ఏమి చెయ్యలేరని చెబుతున్నారన్నారు. ఇసుక అక్రమ దందాపై మంత్రి స్పందించాలని, ఇసుక అక్రమ రవాణా నివరించడానికి అధికారులు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేయలేదు : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి మా కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారని, నిరాధారమైన కామెంట్లు చేయడం మంచిది కాదని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా మా కుటుంబం రాజకీయాల్లో ఉంటూ నిక్కచ్చిగా రాజకీయాలు చేస్తున్నామన్నారు. 15 సంవత్సరాలుగా టిడిపి ఇన్‌ఛార్జిగా ఉంటూ సూడో ఎమ్మెల్యేగా పనిచేశావన్నారు. 9 నెలలుగా అధికారంలో ఎక్కడైనా దందాలు చేశామా అని ప్రశ్నించారు. క్రషర్ల యాజమానుల దగ్గర డబ్బులు వసూలు చేసినట్లు నిరూపించగలవా గత టిడిపి హయాం లో నీరు చెట్టు కింద బినామీ పేర్లు పెట్టి డబ్బులు నొక్కింది నీవు కాదా అని ప్రశ్నించారు. మాపై నిందలు వేయడం మానుకోవాలన్నారు. వచ్చే 2029లో నీవు వైసిపి అభ్యర్థివా అని ప్రశ్నించారు. గతంలో టిడిపి పార్టీలో చేసిన తప్పులవల్ల నీకు టిక్కెట్ రాలేదన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**మా నాయకుడిని విమర్శించడం సరికాదు:** మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి విమర్శించడం సరికాదని టిడిపి మండల నాయకులు కొండా భాస్కర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు అన్నంపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కంకర్ మిషన్‌లో కంకర దొంగిలించాలని తమ నాయకుడి కుటుంబం విమర్శించడం సరికాదన్నారు. మీ కంకర మిషన్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి జరిమాను వేశారన్నారు. టిడిపిలో ఎవరు తప్పు చేసిన చెట్లు తీసుకుంటారని విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు మేఘనాథరెడ్డి, రఘునాథ పాల్గొన్నారు.

## రాయచోటిలో దొంగలు పడ్డారు

**- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్‌రెడ్డి**

ప్రజాశక్తి - రాయచోటి

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా రాజకీయ నాయకులు దొంగతనాలకు పాల్పడిన సంఘటన జరగలేదని, అలాంటిది రాయచోటిలో చోటు చేసుకుంటోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బోస్‌నగర్‌లోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాములవారి కల్యాణంలో పాల్గొంటే రాయచోటి మంత్రి అనుచరులు దొంగతనాలకు పాల్పడ్డారని విమర్శించారు. తాను రోడ్డు నిర్మాణం సామగ్రిని, టిప్పరు, జెసిబిను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే గంట తర్వాత ఆ టిప్పర్, జెసిబి కన్పించలేదని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పోలీస్ యంత్రాంగాన్ని సైతం వాడుకుంటున్నారు అన్నారు. కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకున్న పోలీసు వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం ఉందని, ఏ కష్టం వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తారని చెప్పారు. ఒక పార్టీకి కొమ్ము కాస్తే వాటి ప్రభావం సమాజంపై పడుతుందని పోలీసులు గుర్తించాలని చెప్పారు. ఒక మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదునే పట్టించుకోని పోలీసులు సామాన్యులకు ఎలాంటి రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో తొలి ఏడాది లోనే విపత్కర పరిస్థితులు ఎదురొడ్డి అయిన సంక్షేమ అమలు చేశారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ సత్తా లేని మనిషి అని చంద్ర బాబు చెప్పింది చేస్తారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె ఎంపిపి అంబపతి రెడ్డయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

## 'ఆదిత్య'లో జాతీయ స్థాయి టెక్నికల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-మదనపల్లె

ఆదిత్య ఇంజినీరింగ్‌లో కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2025లో ఆవిష్కరణ, సృజనాత్మకత, సాంకేతిక ప్రతిభ యొక్క అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారని డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. భారతదేశం అంతటా 150కి పైగా బృందాలు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జి, లాట్, సస్టైనబుల్ ఇంజినీరింగ్ వంటి రంగాలలో విస్తరించి ఉన్న అద్భుతమైన ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. ఈ ఎక్స్‌పోను కలికిరిలోని జెఎన్‌టియు ఇసిఇ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ హెచ్‌ఒడి డాక్టర్ కె.అపర్ణ ప్రారంభించారు. యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలలో ఆచరణాత్మక అభ్యాసం, ఆవిష్కరణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యువ తరంలో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడానికి ఇలాంటి ప్లాట్‌ఫారమ్‌లు చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సాంకేతిక ఔత్సాహికులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మదరసాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మదరసా ఏ దారుల్ ఉలూమ్ ఇమ్ దాదియాలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మదరసా ప్రిన్సిపల్ ముఫ్తీ సయ్యద్ మాసూమ్ సాఖిబ్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పెద్ద మదరసా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ దారుల్ ఉలూమ్ ఇందాదియ మదరసాలో నూరాని ఖైదా, నాజిరా ఖురాన్, హిబ్జ్, పార్సీ, దరసె నిజామి, మౌల్వీ కోర్సులలో చేరేందకు దరఖాస్తుచేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉచిత భోజన, దుస్తులు, వైద్య, హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. దీనియత్ చదివే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిలబస్ ప్రకారం హైస్కూల్ వరకు, ఓపెన్ స్కూల్ విద్యా బోధన చేసి పరీక్షలు రాయించి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9441432607, 9030272740, 8500962886లలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు. సమావేశంలో ఖారి షాకిరుల్ల, మౌల్వీఅసద్, షహిన్షావలి బేగ్ పాల్గొన్నారు.

## భూమనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి**

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పసుపు శ్రేణులు కృషి చేయాలని రోడ్లు, భవనాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాజంపేటలోని ఆర్అండ్‌బి అతిథి గృహానికి చేరుకున్న ఆయన తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శక్తివంతంగా ఉందన్నారు. వైసిపికి చెందిన టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వ్యవహార శైలిపై ఆయన మండిపడుతూ కరుణాకర్‌రెడ్డి టిటిడిని భ్రష్టుపట్టించాడని, తిరుమల తిరుపతి దేవస్థానంలోని గోశాలలో 100 గోవులు మృతి చెందినట్లు అసత్య ఆరోపణలు చేశాడని పేర్కొన్నారు. వయసు పైబడిన రీత్యా అనారోగ్యంతో ఒకటో రెండో గోవులు మృతి చెందడం సహజమే కానీ, 100 గోవులు ఒకేసారి మృతి చెందితే కనీసం దుర్వాసన రాకుండా ఉంటుందా అని ప్రశ్నించారు. లేనిపోని అబద్ధాలు చెబుతూ రాజకీయ పబ్బం గడుపుకునేందుకే గోశాల నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. భూమన ఒక నాస్తికుడని, అతనికి పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంపై మాట్లాడే అర్హతే లేదన్నారు. సామాన్య ప్రజలను రెచ్చగొట్టే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానంపై అసత్య ఆరోపణలు చేసినందుకు భూమన కరుణాకర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి

ప్రమాద స్థలాన్ని పరిశీలించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

## మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

### -సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే 'అరవ'

**ప్రజాశక్తి-చిట్వేలి**

మండలంలోని ఎం.రాచపల్లిలో ఈతకు మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను శనివారం కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఖాదీ బోర్డు స్టేట్ చైర్మన్ కెకె.చౌదరి పరామర్శించారు. చిన్నారులు చొక్కా రాజుదేవా, చొక్కా రాజుజయ, రెడ్డిచెర్ల యశ్వంత్ నీటి కుంటలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన విషాదకర సంఘటనతో ఆ గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆడుకుంటూ నీటి కుంటలోకి వెళ్లిన ముగ్గురు చిన్నారులు లోతు ఊహించని స్థాయిలో ఉండటంతో మునిగి ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని అందించి, వారి వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరిశీలించారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరి వెంట సిఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ రఘురాం ఉన్నారు.

## ప్రాణాంతక వ్యాధులపై అవగాహన

**ప్రజాశక్తి-కలకడ**

మండల పరిధిలోని ఎర్రకోట పల్లి పిహెచ్‌సి పరిధిలోని కత్తివారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా హాజరైన ప్రజలకు డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ , ఎంపిహెచ్ఇఒ జయరామయ్య క్షయ, కుష్ఠు, ఎయిడ్స్, సికిల్ సెల్ రక్తహీనత, రక్తదానం, అందరికి కేన్సర్ పరీక్షలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుచు రెండు వారాలకు పైబడి దగ్గు ఉండుట, ఆయాసం, ఛాతిలో నొప్పి, దగ్గినపుడు గళ్ల వచ్చుట, గళ్లలోరక్తం కన్పించడం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం వంటి లక్షణాలు ఉంటే అది టిబి జబ్బు అని అనుమానించి సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రం లో చూపించుకోవాలన్నారు. విచ్చలవిడి శృంగారం హెచ్ఐవి, ఎయిడ్స్‌కు నాంది అని అన్నారు. జీవిత భాగస్వామి తోనే లైంగిక జీవితం గడపాలని అన్నారు. నొప్పి, నవ్వ, స్పర్శ లేని మచ్చలు కుష్ఠు వ్యాధి కావచ్చు కావున సమీప ఆరోగ్య కేంద్రం లో ఇటువంటి మచ్చలు ఉన్న వారు పరీక్ష చేయించుకుని ఒకవేళ నిర్ధారణ ఐతే చికిత్స పూర్తిగా ఉచితంగా ఇస్తామని అన్నారు. 18సంవత్సరాల పైబడిన వారు అందరు రక్తదానం చేయవచ్చుని, యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. 18సంవత్సరాల పైబడిన అందరికి నోటి, రొమ్ము, గర్భశయ కేన్సర్ లపై కూడా అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్లేకార్డ్స్ ప్రదర్శన చేస్తూ నినాదాలు పలుకుచు అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఎంఎల్‌హెచ్‌పి గోపి, ఎఎన్ఎం లక్ష్మీదేవి, టీచర్ సుబ్రహ్మణ్యం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## జాయింట్ సెక్రటరీగా హేమంత్‌కుమార్

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీను శుక్రవారం నియమించింది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బి.హేమంత కుమార్ వైసిపి రాష్ట్ర స్టూడెంట్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితు లయ్యాడు. తన నియామకానికి సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ముందుంటా నన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్టూడెంట్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించబడిన హేమంత్ కుమార్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

## శ్రీకృష్ణారెడ్డి సిద్దార్థ విద్యార్థుల విజయకేతనం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలోని శ్రీక్రిష్ణారెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. మొదటి, ద్వితీయ ఇంటర్ ఎంపిసి, బైపిసి గ్రూపులలో 989 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపల్ ఎన్.క్రిష్ణారెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూప్ లో హాసిని 462, భరత్ కుమార్ 462, మహతి 461, మధురాని 461, జ్యోతి స్వరూప్ రెడ్డి 461, నిఖిల్ చక్ర 460, హఫ్స కౌసర్ 429, హర్షియా జైనబ్ 428, మహమ్మద్ అష్రఫ్ 428, ప్రియ 477, మోక్షిత 459, పవిత్ర 445 మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వెంకట సాయి దీపక్, హరిత 989, మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచారన్నారు. అదేవిదంగా జాహ్నవి 986, సాయి సిద్ధిక్ష 984, సుఫియాన్ 984, కావ్యశ్రీ 983, స్పందన 979, లావణ్య 941, నవ్యశ్రీ 897, మదనమోహన్ 937 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అద్యాపకులను కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి అభినందించారు. విద్యార్థులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన సంధ్య

### - సిఇసిలో మొదటి స్థానం

**ప్రజాశక్తి-నందలూరు**

ఇంటర్మీడియట్ ఫలితాలలో సిఇసి రెండవ సంవత్సరంలో ప్రతిభ చాటి నందలూరు కీర్తి ప్రతిష్ఠతలను పెంచింది నందలూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డి, రోజా దంపతుల కుమార్తె సంధ్య. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 1000 / 975 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 548 మార్కులతో మండల టాపరుగా నిలిచిన సంధ్య పిదప రాజంపేట నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఇసి గ్రూపులో చేరింది. రాష్ట్రస్థాయి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన సంధ్యను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, మండలంలోని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ గ్రూప్స్ ప్రిపేర్ అయ్యి ఐఎఎస్ కావాలన్నదే తన లక్ష్యం అని పేర్కొంది.

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

## వికసించిన కెజిబివి, ఆదర్శ విద్యార్థులు

**ప్రజాశక్తి-కలకడ**

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 29 మందికి 29, ద్వితీయ సంవత్సరంలో 27 మందికి 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో స్వాతి మొదటి సంవత్సరంలో 483 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో అంకిత 961 మార్కులు సాధించినట్లు తెలియజేశారు. ఇంటర్ ఫలితాలలో కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆదర్శంగా నిలిచారని ప్రిన్సిపల్ మలం షావలి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 75 మందికి 65 మంది, మొదటి సంవత్సరం 100 మందికి 64 మంది పాస్ అయ్యారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసి ఎస్.మిన్హా 983 మార్కులు సాధించిం రాష్ట్రస్థాయిలో 8వ స్థానంలో నిలిచిందనిఅన్నారు. ఎస్.సంరిన్ 974 మార్కులు సాధించారు. ఎంపిసిలో బి.అఖిల 947 సల్మిన్ తార 939 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్ నందకిషోర్ 438, ఎస్.సుమియాజ్ 431 మార్కులు సాధించి ద్వితీయ సంవత్సరం 91శాతంచ మొదటి సంవత్సరం 64శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, అధ్యాపక బృందం అభినందించారు. శ్రీ సాయి జూనియర్ కళాశా లలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 74శాతం ఉత్తీర్ణత సాధించి గణేష్ 448 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచినట్లు తెలిపారు. రూపేష్ 436 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీరాములు తెలిపారు. సత్తాచాటిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన కెజిబివి, ఆదర్శ పాఠశాల విద్యార్థులు

## ఎస్‌వి కళాశాల విజయ పరంపర

**ప్రజాశక్తి- రైల్వేకోడూరు :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయపరంపర కొనసాగించారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ ఎస్ వసుంధర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో బైపిసి గ్రూప్‌లో జయశ్రీ 982/1000 టౌన్ ఫస్ట్ సాధించిందని, ఎస్ అఫ్సాన 981/1000 కళాశాల ఫస్టుగా నిలిచిందని, ఎంపీసీ ఇంగ్లీష్ మీడియం నందు ఎల్ దీపిక 979/1000, వి కీర్తి 975/1000, సిఇసి గ్రూపులో డి.హరున 912/1000 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించిందని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో కె.చందన 464/470 మార్కులతో టౌన్ ఫస్ట్ తో పాటు స్టేట్లో నాలుగో ర్యాంక్ సాధించిందని, హెచ్ జె తేజ స్వరూప్ 457/470, పి.కిన్నెర 455/470 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించిందని తెలిపారు. బైపిసి ఇంగ్లీష్ మీడియంలో ఎస్ అఫ్సాన 414/440 హక్కులతో టౌన్ సెకండ్ కాలేజీ ఫస్ట్ సాధించిందని, సీఈసీ ఇంగ్లీష్ మీడియంలో కె.దివ్య443/500 మార్కులతో కాలేజీ ఫస్ట్ నిలిచిందని అలాగే సీనియర్ ఇంటర్ ఫలితాలలో 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 23 మంది ఉన్నారని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

## ప్రతిభ చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

### ఎంపిసిలో 959 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన బేబీ

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

బేబీ (ఎంపిసి) ఎం.అంజలి(ఎంపిసి) ఎస్.అర్షద్(సిఇసి)

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాల, ముష్టూరు కస్తూర్బా విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీధర్, కె.ఎస్.ఎన్ మూర్తి, ముని వెంకటమ్మ తెలిపారు. రెడ్డివారిపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని బేబీ ( ఎంపీసీ) ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 959/1000 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలవగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినిలు ఎం.అంజలి 927/1000 మార్కులతో, ఎం.కీర్తి 926/1000 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థిని షాలిని ( బైపిసి)లో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 944 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్. అర్షద్ ( సిఇసి ) లో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 923 మార్కుల సాధించారు. నిమ్మనపల్లి మండలంలో ద్వితీయ సంవత్సరంలో మొత్తం 156 మంది విద్యార్థులకు గాను 146 మంది ఉత్తీర్ణులు కాగా 10 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో మొత్తం 190 మంది విద్యార్థులకు గాను 142 మంది ఉత్తీర్ణులు కాగా 48 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.తమన్నా కౌసర్ (ఎంపీసీ) 444/470 మార్కులతో, ఆర్.రెడ్డిశ్వరి ( ఎంపీసీ) 442 మార్కులతో, మోడల్ స్కూల్ కి చెందిన చౌప్రీత్ ( ఎంపీసీ) 430 ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మోడల్ స్కూల్ కి చెందిన విద్యార్థిని ఫలీషా అజ్మ ( బైపిసి) లో 426/440 మార్కులు సాధించారు. కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.అంకిత ( సిఇసి ) 438 మార్కులతో మండలంలో టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీధర్, ఎం.ఎస్.ఎన్ మూర్తి, ముని వెంకటమ్మ, అధ్యాపకులు రాధాకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

## జూనియర్ కళాశాల విద్యార్థుల విజయం

**ప్రజాశక్తి-వీరబల్లి**

ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 93.45శాతం, ద్వితీయ సంవత్సర ఫలితాలలో 97.24శాతం మొదటి స్థానం నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, వైస్ ప్రిన్సిపల్ రఘురామయ్య తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎం.మానస, ఎంపిసి విభాగంలో 444/470, ఎం.జ్యోతి సిఇసి విభాగంలో 444/500 ఎస్.వెంకటసుబ్బలక్ష్మి, బైపిసి విభాగంలో 423/440 మార్కులు సాధించారని అన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎం.సంతోష్ బైపిసి విభాగంలో 948/1000 పొంది కళాశాల టాపర్‌గా నిలిచారని అన్నారు. వి. శ్రీదేవి ఎంపిసిలో 938/1000, ఏ.ఈశ్వరయ్య సిఇసిలో 854/1000 ఎం.నాగరాణి హెచ్ఇసిలో 814/1000 మార్కులను పొంది కళాశాలలో స్థానంలో నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఇంప్రూవ్మెంట్ రాసుకునే విద్యార్థులు 13వ తేదీ నుంచి కళాశాలలో పరీక్ష ఫీజు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి ఈ నెల 23వ తేదీ వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు బ్రిడ్జికోర్స్‌లో తరగతులు నిర్వహించడం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సాధారణ సిలబస్ చెప్పడం జరుగుతుందని అన్నారు. మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందే విద్యార్థులు వెంటనే వచ్చి అడ్మిషన్ పొందాలని ఈ విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎంబైపిసి గ్రూపు, సైన్స్ విద్యార్థులు ఆర్ట్స్ చదువుకునే అవకాశాన్ని కూడా బోర్డు కల్పిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా తెలిపారు. ప్రయివేట్, కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని ఆకాక్షించారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

## వెంకటరెడ్డి సిద్దార్థ విద్యార్థుల విజయదుందుభి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ ఫలితాల్లో శ్రీవెంకటరెడ్డి సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపిసి గ్రూపులో పట్టణంలోనే ప్రథమ స్థానం సాధించినట్లు కరస్పాండెంట్ ప్రిన్సిపల్ వెంకటరెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు తబసుమ్ 465, సమీన 464, లక్ష్మి కుమార్ రెడ్డి 463, సాయి దీక్షిత్ 463, అజయ్ కుమార్ 462, నిమ్రా 461, అఫ్సాన్ బేగ్ 461, జితేశ్వర్ 461, పవన్ తేజ 461, తరుణ్ కుమార్ 461, హితేష్ 460, అరాఫత్ 460, శ్రీజ 460, రుహినాజ్ 460, రోహిత్ 460 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అదే విధంగా రెండో సంవత్సరం బైపిసి, ఎంపీసీ గ్రూపుల నందు కూడా ప్రథమ స్థానం సాధించారు. ఎంపీసీ నందు దేవదీప్య సాయి 1000 మార్కులకు గాను 987, బైపిసి నందు రోహిణి సుహేలా 986 మార్కులు సాధించారన్నారు.అదేవిధంగా మల్లికార్జున 985, ఆల్మాష్ 984, బాలనాగహాసిని 985, మిథున్ హరిహరన్ 984, అస్మా 983, నవ్యశ్రీ 982, జవహర్ ఫాతిమా 981, గంగోత్రి 980, తనుశ్రీ 980 మార్కులతో ఆల్ టైం రికార్డు సాధించారన్నారు .ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు, కృషి చేసిన అద్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచిపెట్టారు.

## మొదటి సంవత్సరంలో కస్తూర్బా..

## ద్వితీయ సంవత్సరంలో మోడల్ స్కూల్ మండల టాపర్లు

**ప్రజాశక్తి-రామాపురం**

భవిత

మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొదటి సంవత్సరంలో కస్తూర్బా విద్యార్థినిలు, ద్వితీయ సంవత్సరంలో మోడల్ స్కూల్ విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరంలో విద్యార్థిని బి భవిత 484/500, సుష్మ 477/500, సిఎస్‌సి గ్రూపులో మార్కులుసాధించిది ద్వితీయ సంవత్సరంలో మోడల్ స్కూల్ విద్యార్థిని షఫీయా 962/1000 గంగోత్రి 959/1000 బైపిసి గ్రూపులో మార్కులుసాధించి మండల టాపర్లుగా నిలిచారు. టాపర్లుగా నిలిచారని ఆయా కళాశాలల ప్రిన్సపాళుపేర్కొన్నారు. మండలంలో ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పై చేయిగా సాధించారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీధర్

## శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి-మదనపల్లె**

ఇంటర్మీడియట్ ఫలితాలలో మదనపల్లి పట్టణం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపిసి గ్రూప్‌లో 1000కి గాను 989 మార్కులు సాధించి మదనపల్లి పట్టణంలో ఆర్. తేజస్విని టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి ని ఆర్.తేజస్వినిని కళాశాల ప్రిన్సిపల్ సి.శ్రీధర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డి.మధుకర్‌రెడ్డి, అధ్యాపకులు వీరబ్రహ్మం, బాలకృష్ణమ నాయుడు, గంగాధర్ అభినందించారు.

## శ్రీమేధ విజయభేరి

**ప్రజాశక్తి-పీలేరు**

ఇంటర్ ఫలితాల్లో పీలేరు శ్రీమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని కళాశాల ప్రిన్సిపల్ లోకేష్‌బాబు తెలిపారు. తమ కళాశాల సీనియర్ ఎంపీసీ విద్యార్థి ఎస్ఎం కేతన 1000/986 మార్కులు, ఎస్. మెహతాజ్ 1000/980, ఎస్.నందిని 1000/980 మార్కులు సాధించారని అన్నారు. జూనియర్ ఎంపిసిలో జి. వినూష 470/448 మార్కులు, వై. సంజన 470/ 442 మార్కులు, జూనియర్ బైపిసిలో ఎస్. సనాసమ్రీన్ 440/421 ఫాతిమా 440/398 మార్కులు, జూనియర్ సీఈసీలో యు. హరీష్ 500/452, నవరసాల వీణాధరి 500/438 మార్కులు సాధించారని అన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ వై.సంజీవ, అధ్యాపకులు అభినందించారు. తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి కళాశాలకు మంచి గుర్తింపు తీసుక వచ్చారని అభినందించారు.

విజయం సాధించిన శ్రీమేధా విద్యార్థులు

శ్రీరాముడి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## కమనీయం..శ్రీసీతారాముల కల్యాణం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలోని పోకనాటి వీధిలోని శ్రీరాముని ఆలయంలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలకు శ్రీరామనవమినని పురస్కరించుకొని విశేష అలంకరణ చేసి సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.అర్చకులు చేత వేద మంత్రాలు, శ్రీ రామగోవింద నామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో కల్యాణ క్రతువును జరిపించారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులు,ప్రజలకు పోకనాటి వీధి యువజన సంఘం ఆధ్వర్యంలోభోజన వసతి కల్పించారు.

## పుల్లంపేటలో కోదండరాముడి..

**పుల్లంపేట :** పుల్లంపేటలో వెలసి ఉన్న శ్రీ కోదండ రాముని కల్యాణం కనుల పండువగా అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య అత్యంత కమనీయంగా నిర్వహించారు. వైభవంగా ముత్యాల తలంబ్రాలు జారవిడిచారు. అనంతరం శ్రీ సీతారాముల స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మంత్రి కుటుంబ సభ్యులపై ఆరోపణలు తగవు

**ప్రజాశక్తి-రామాపురం**

ఎవరో తప్పు చేస్తే ఆ తప్పుని మంత్రి కుటుంబ సభ్యులకు ఆపాదించడం మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్ రెడ్డికి తగదని మండల టిడిపి నాయకులు గాలివీటి సురేంద్రరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రామకృష్ణ గౌడ్, చెన్న కృష్ణారెడ్డి, దేవదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఎవరో మంత్రి పేరు చెప్పి కంకర తోలారని, దానికి మంత్రికుటుంబ సభ్యులపై మాజీ ఎమ్మెల్యే ఆర్ఆర్ ఆరోపణ చేయడం సబబు కాదని అన్నారు. మంత్రి కుటుంబ సభ్యులు 20 సంవత్సరాలుగా అధికారం లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తూ ఎక్కడ అవినీతి ఆరోపణ లేకుండా రాజకీయం చేస్తున్నారని అన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేక ఆయన కుటుంబ సభ్యులపై నిందలువేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఈ సమావేశంలో సహదేవరెడ్డి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సభ్యుడు వెంకటరమణ పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

### -మృతురాలి వద్ద ఉన్న రూ.2 లక్షల నగదు, బంగారు నగలు మాయం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

గంగులమ్మ (ఫైల్ ఫొటో)

వ్యాపారం చేసుకుని జీవనం సాగించే ఓ మహిళ శనివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె రోడ్డు ప్రమాదంలో చనిపోయిందా లేక ఆమె వద్ద ఉన్న నగలు, నగదు దోచుకునేందుకు హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారా అనే అనుమానాలు కలకలం రేపుతున్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, చంద్రా కాలనీకి చెందిన లేట్ రెడ్డప్ప భార్య గంగులమ్మ (65) ఊరూరా తిరిగి బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వ్యాపారం చేసుకునేది. కాగా ఈమె చెల్లెలి కుమారుడు, కొత్తిండ్లులో ఉంటున్న వెంకటరమణ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అతన్ని పరామర్శించి వైద్యానికి అవసరమైన నగదును ఇచ్చేందుకు రూ.2 లక్షలు నగదు తీసుకుని ఉదయాన్నే బయలుదేరింది. స్థానికంగా ఉన్న ఓ ఆటోను ఎక్కి ఆర్‌టిసి బస్టాండ్ లో దింపాలని కోరింది. అతను అక్కడికి తీసుకెళ్లకుండా చిత్తూరు బస్టాండ్ నుంచి నిమ్మనపల్లె రోడ్డు లోని రామాచార్లపల్లి వైపు తీసుకెళ్లాడు. ఇంతలో ఏమి జరిగిందో ఏమో రోడ్డు పక్కన ఓ రాయికి ఢీ కొట్టినట్లు చెబుతున్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలోని గంగులమ్మ కిందపడి చనిపోయిందని చెబుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద నపల్లె ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించి, ఆటోను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. మా అమ్మను హత్య చేసి నగదు, నగలు దోచుకున్నారని మృతురాలి కుమార్తె రెడ్డెమ్మ, అల్లుడు ఆనంద్ ఆరోపిస్తున్నారు. రూ.2 లక్షల డబ్బుతో ఆస్పత్రికి బయల్దేరిన మా అమ్మను ఆటో డ్రైవర్ ఆర్‌టిసి బస్టాండ్‌కు తీసుకెళ్లకుండా దారి మళ్లించి, రామాచార్లపల్లి వైపు ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## టైరు పగిలి కారు బోల్తా : తప్పిన పెనుప్రమాదం

**ప్రజాశక్తి-నందలూరు**

కడప- చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు వద్ద చెయ్యేరు బ్రిడ్జి మీద టైరు పగలడంతో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి పెను ప్రమాదం తప్పింది. ఖమ్మం నుంచి తిరుమలకు వెళ్తున్న తోటకూరి నరేష్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా టైరు పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్త ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

## పిల్లల ఈత సరదా..ప్రమాదవశాత్తూ తండ్రి మృతి

**ప్రజాశక్తి-పీలేరు**

పిల్లల వేసవి తాపం తీర్చడానికి సరదాగా ఈతకు తీసుకు వెళ్లిన తండ్రి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.విపల్లి మండలం, మారెళ్ళ పంచాయితీ, పడమటపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నందకుమార్ (42) పీలేరు పట్టణం సైనిక నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పిల్లలకు సెలవులు ఉండడంతో శనివారం తన కుమారుడు యోజిత్(15), కుమార్తె దీపిక (12)లను ఈత కోసం మండలంలోని బోడుమల్లువారిపల్లి సమీపంలోని పింఛా నదిలో ఓ బావి వద్దకు తీసుకు వెళ్లాడు. ముందుగా బావిలోకి దూకిన ఉపాధ్యాయుడు ఎంతకు పైకి రాకపోవడంతో పిల్లలిద్దరూ భయంతో జోరుగా కేకలు పెట్టారు. అక్కడే ఈతకు వచ్చిన ఇతర యువకులు నీట దిగి చూడగా అతను నీటి అడుగున బురదలో చెక్కుకుని ఉండడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, అగ్నిమాపక సిబ్బంది సహకారంతో ఉపాధ్యాయుడు నందకుమార్ ను వెలికి తీశారు. అయితే ఆయన అప్పటికే మృతి చెంది ఉన్నాడని గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నందకుమార్ భార్య స్వర్ణలత పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో పర్యవేక్షకురాలుగా విధులు నిర్వహిస్తోంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో మృతుడి భార్య, పిల్లల రోధన చూపరులను సైతం కంటతడి పెట్టించాయి. ఉపాధ్యాయుడిని తిరుపతి జిల్లా, ఎర్రవారిపాలెం మండలం, బోడేవాళ్ళపల్లి పంచాయితీ, సారగుంటపల్లెలో ఆదివారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఉపాధ్యాయుడు మృతి వార్త తెలుసుకున్న సహ ఉపాధ్యాయులు ఆయన స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.